"మీరు బాగా ఆనందంగా ఉంటారని విన్నాను. నిజమేనా?" ప్రశ్నించాడు ఆ ధనవంతుడు.

"అనే అనుకుంటున్నారంతా." నవ్వాడు అతను.

"మీ చొక్కాని ఓ సారి ఇస్తే దాన్ని తొడుక్కుని ఇచ్చేస్తాను." కోరాడు ధనవంతుడు.

"నా అన్నదే నాకు లేనప్పుడు ఇంక చొక్కా ఎక్కడనించి వస్తుంది?" గోచీలో ఉన్న అతను నవ్వుతూ ప్రశ్నించాడు.

## 100. స్వీయ బోధ

ఓ కట్టెలు కొట్టుకునే వాడికి అడవిలో మిల మిల మెరిసే ఓ రాయి దొరికింది. అతడు దాన్ని ఓ వజ్రాల వ్యాపారస్థుడి దగ్గరకి తీసుకెళ్ళి చూపించి అడిగాడు.

"ఇది నాకు అడవిలో దొరికింది. దీన్ని అమ్మితే నేను జీవితాంతం సుఖంగా జీవించేంత డబ్బు వస్తుందా?"

ఆ వర్తకుడు దాన్ని పరిశీలించి అది ఏ మాత్రం విలువ లేని రాయి అని గ్రహించాడు. అయితే ఆ విషయం తెలిస్తే వాడు బాధ పడతాడని చెప్పాడు.

"మరి కొన్ని పరీక్షలు చేసి కాని నేను ఏం చెప్పలేను. నెల తర్వాత దీన్ని మళ్ళీ తీసుకురా. నా దుకాణానికి నువ్వు రోజూ వచ్చిపోతూంటే రాళ్ళ గురించి ఒకర్ని అడగకుండా నీకే తెలుస్తుంది."

రోజూ తీరిక వేళల్లో ఆ కట్టెలు కొట్టుకునేవాడు ఆ దుకాణానికి వెళ్ళి కూర్చునేవాడు. ఆ వర్తకుడు చెప్పే చిన్న చిన్న పనులని చేసేవాడు. ఏవి విలువైన రాళ్ళో, ఏవి కావో ఎలా తెలుసుకోవాలో అతను కట్టెలు కొట్టేవాడికి నేర్పసాగాడు. ఇలా కొద్ది వారాలు గడిచాక కట్టెలు కొట్టేవాడికి విలువైన వజ్రాల స్వరూపం పూర్తిగా బోధపడింది. ఓ రోజు తనకి దొరికిన రాతిని తీసి పరీక్షించి చూసాడు.

అది విలువ లేనిదని గ్రహించగానే బాధ కలిగింది. వెంటనే ఆ వజ్రాల వ్యాపారి దగ్గరకి వెళ్ళి చెప్పాడు.

"నా ఆశ అడియాశే అని తెలుసుకునే జ్ఞానాన్ని నాకు నేర్పినందుకు మీకు సర్వదా కృతజ్ఞుడ్ని. మీరు చక్కటి యజమాని కాబట్టి మీ దగ్గర నేను పని చేయాలని అనుకుంటున్నాను."

ఇదేవిధంగా దేవుడు కూడా మనం చేసే పొరబాట్లని మనమే తెలుసుకునేలా చేసి, మళ్ళీ ఎన్నడూ మనం అలాంటి పొరబాట్లని చేయకుండా చేస్తూంటాడు. అందుకే జీవితంలో మనకి కలిగే వివిధ కష్టాలు, నష్టాలు, చేదు అనుభవాలు ఏ కారణం లేకుండా జరగవు. అవి మనకి పాఠాలు.

## 101. మంచివే ఇవ్వు

ఓ రోజు ఓ యువరాణి సాధారణ దుస్తుల్లో రాజభవనం నించి శివాలయానికి వెళ్ళింది. ఆమె గుళ్ళో అర్చన ముగించుకుని బయటకి వచ్చేసరికి ఆకాశం నిండా దట్టంగా మబ్బులు కనిపించాయి. దాంతో ఆమె సమీపంలోని ఓ ఇంటికి వెళ్ళి వాళ్ళని ఓ గొడుగు ఉంటే ఇవ్వమని, తర్వాత తన నౌకరుతో పంపుతానని చెప్పింది.

ఆ ఇంటి యజమానికి ఆమెలోని రాజసం చూసి ఆమె దొంగ కాదన్న నమ్మకం ఏర్పడింది. ఐతే ఎందుకైనా మంచిదని తను వాడే మంచి గొడుగు కాక, అటక మీద ఉన్న ఊచలు ఊడిన ఓ గొడుగుని ఇచ్చాడు.

మర్నాడు ఎవరో ఆ గొడుగుని తీసుకువచ్చి ఆయనకి తిరిగి ఇస్తూ పది బంగారు నాణాలని కూడా ఇచ్చి చెప్పాడు.

"సమయానికి నిన్న మీరు మన యువరాణికి గొడుగుని ఇచ్చి ఆదుకున్నందుకు గాను రాజు గారు మీకు తన కృతజ్ఞతలని తెలియచేయమన్నారు. బహుమతిగా ఈ నాణాలని ఇవ్వమన్నారు."

ఆ మాటలు విన్న ఆ ఇంటి యజమాని నిశ్చేష్టుడయ్యాడు.

'అయ్యో! ఆమె యువరాణని తెలిస్తే ఊచలు ఊడిన గొడుగు బదులు నా దగ్గరున్న మంచి గొడుగునే ఇచ్చేవాడిని. ఆ అవకాశం ఎలా పోగొట్టుకున్నానో కదా!' అతను బాధ పడ్డాడు.